51902870l

# ప్రబోధ 8

దేవుడన్నపదము తెలియునందరికిని
పదము తెలిసినంత మాటయేమి
దేవుడన్నవాని చేరిసేవించిన
దేవుడన్నపదము తెలియునయ్య.
మంచి తలపులు మాటలు మంచి చేత
మంచి వినికిడి చూపులు మంచితనము
మంచి ఆరోగ్యములనిచ్చు మానవులకు
సత్యమును తెల్పుచుండె యీసాయిమాట.

అధ్యాపకులారా! విద్యార్థులారా!

సనాతన కాలమునుండి యీప్రపంచమున దేవుని తెలుసుకొనే నిమిత్తమై యనేక విధములైన ప్రయత్నములు జరుగుతూనే వున్నవి. దేవుడనగా ఎవరు అనే ప్రశ్నగానీ, ఈ దేవుడెక్కడున్నాడు అనే ప్రశ్నగాని యీనాటిది కాదు. సృష్టి ఆదినుండియు యీ జటిలమైన ప్రశ్నను నివారించుటకై యనేక విధములైన ప్రయత్నములు సలుపుతూ వచ్చారు మహర్షులు. కఠినదీక్షనుపూని కారడవులకేగి, నిద్రాహారములు మాని, యీ దివ్యత్వమైన దైవత్వమును అన్వేషించాలని అనేకశ్రమలకోర్చి కొంతమంది యీసత్యాన్ని గుర్తించారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అనే సత్యాన్ని వారు గుర్తించి మానవుని యొక్క ప్రయత్నం దైవము యొక్క అనుగ్రహంచేత సాఫల్యం కాగలదనే విశ్వాసముతో వారు యీ దీక్షను పూనుకున్నారు. నడచుటకు ప్రయత్నము చేసిన చిన్నచీమ అయినాకూడను కొన్ని మైళ్ల దూరం ప్రయాణం చేయగలదు. ఇష్టమే లేకుండిన, శ్రద్ధనే కల్గకుండిన గ్రద్దయైనాకూడను ఒక్క అడుగు ముందుకు నడవలేదు. కనుకనే 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అన్నారు. శ్రద్ధకల్గినవానికి యెంతటి జటిలమైన సమస్యలైనా సులభముగా తీర్చుకొని ఆనందించి సుఖశాంతులను అందుకోగలడు.

దైవత్వాన్ని గుర్తించిన మహనీయులు, ఋషులు, దేదీప్యమానమైన, ప్రకాశవంతమైన పురుషుని మేము చూడగల్గాము. అజ్ఞానమనే అంధకారమునకు ఆవలనున్న మహాపురుషుని మేము దర్శించగలిగాము. కోటిసూర్యులకాంతితో వెలిగే దివ్యజ్యోతిని మేము అనుభవించగల్గాము. అని వారు ప్రజలకు చాటుతూ వచ్చారు. అదే ప్రప్రథమమున ప్రపంచమునకు బోధించిన వేదము యొక్క సారము. దానినే వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్య

వర్ణం తమస స్పరస్తాత్. ఈ మహాపురుషుడు తేజోవంతుడై, ప్రకాశవంతుడై, అజ్ఞానమనే అంధకారమునకావల వున్న మహాపురుషుడు యితడే. మానవునియందు అజ్ఞానము, అంధకారము యేనాడు పటాపంచలై పోవునో ఆనాడే యీ పవిత్రమైన జ్యోతిని ఆత్మజ్యోతిని అనంత జ్యోతిని అద్వితీయ జ్యోతిని అందుకోగలడని వారు చాటుతూ వచ్చారు. అయితే యీ మహర్షులయొక్క డచూచారు. బయటప్రపంచములో చూశారా? కాదు.కాదు. పంచకోశములను పరిశీలించి పంచప్రాణములను విచారించి మానవునియందు యీ దివ్యతేజోవంతమైన తత్వమును వారివారి హృదయములందే వారు గుర్తించగల్గుతూ వచ్చారు.

దైవప్రీతి కల్గిన వారికి అన్నింటికంటె సమీపుడు భగవంతుడని గుర్తించారు. దైవప్రీతి లేని వారికి యెంత దూరముందో అంతకంటె యింకా దూరమైన వానిగా గోచరిస్తూ వచ్చారు. మాణిక్యము మట్టిలో దొరుకును గాని షాపులో రాదు. కానీ మట్టిలో వెదుకవలసిన మాణిక్యాన్ని షాపులో వెతకటానికి ప్రయత్నంచేసే మానవునికి యీ మాణిక్యం యేరీతిగా లభ్యమౌతుంది. భూమి, శబ్ద, స్పర్శ, రూప, రస గంధములతో కూడినది. అదే మట్టి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము వీటితో కూడినది యీ ప్రపంచము. మానవుని శరీరము కూడను మట్టితో, నీటితో, నిప్పుతో, గాలితో ఆకాశమనే శబ్దముతో కూడినదే. కనుకనే యీ దివ్యత్వమైన మాణిక్యమును, దివ్యత్వమైన చిన్మయత్వాన్ని యీ మృణ్మయములోనే మనము వెతకాలి. కనుక దైవమనే చిన్మయస్వరూపుడు ఎక్కడ వున్నాడంటే, మృణ్మయమైన దేహమునందే వున్నాడనే సత్యాన్ని ఆ ఋషులు గుర్తించారు.

మమైవాంశో జీవలోకే జీవభూత సనాతనః అన్నారు. మమైవాంశో అన్నాడు. ఇంద్రియాంశము గాని, మానసాంశము గాని, ప్రకృతాంశము గాని కాదు. జీవాంశము కూడా కాదు. మమైవాంశో. నా అంశమే. సాక్షాత్తు నా అంశమే యీ మానవునియందు దేదీప్యమానముగా హృదయమునందు వెలుగుచున్నదన్నాడు. ఈ సత్యాన్ని గుర్తించిన మహర్షులు ఆనాటినుండి యీ దేహమును దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవః సనాతనః అన్నారు. అనగా సనాతనమైన దేవుడు జీవరూపములో యీ నూతనమైన దేహములో విలసిల్లుచున్నాడు అని నిర్ణయించుకున్నారు. దేహమనగా కేవలము సామాన్యమైనది కాదు. ఆత్మదేవునకు యిది ఒక గొప్ప మందిరము. ఇదే గొప్ప దేవాలయము. దేహో దేవాలయః యిది దేవాలయము వంటిది. అయితే యీ దేవాలయములో వుండే దేవుని దర్శించటానికి కొన్ని నియమములుంటున్నాయి. కొన్ని మార్గములు కూడా వుంటున్నాయి. లోకములో గొప్ప గొప్ప భవనములకు అధికారుల యిండ్లకు, రాజుల యొక్క నివాసమునకు ముఖ్యద్వారమునందు వాచ్‌మెన్ కాపలా కాస్తూ వుంటాడు. సామాన్య అధికారుల యిండ్లకు శ్రీమంతుల యిండ్లకు, రాజుల యిండ్లకు యీ విధంగా కాపలాదారులు కావలి కాస్తున్న తరుణంలో అందరికి ఉత్తమమైన, ప్రపంచమునకే నాయకుడైన, అండపిండ బ్రహ్మాండములనే హస్తమునందుంచుకొన్న యీ భగవంతుని భవనమునకు కాపలాదారులు వుండనక్కరలేదా. ఆ ఆత్మ

519028703

దేవుని దర్శింపవలెనన్న, యీ దేహమనే దేవాలయములో ప్రవేశించవలెనన్న, దీనికి నాల్గు ద్వారములుంటున్నాయి. ఒక్కొక్క ద్వారము వద్ద ఒక్కొక్క మహాబలవంతుడైన, తేజముతో కూడిన, దైవాజ్ఞతో నియమింపబడిన ధీరుడు ఒక్కొక్కడు కాపలా కాస్తూ వుంటాడు. మొదటి ద్వారము వద్దనున్న కాపలాదారుని పేరు శమము. రెండవ కాపలావాని పేరు విచారణ. మూడవ కాపలావాని పేరు తృప్తి. నాల్గవ కాపలావాని పేరు సత్సంగము.

మొట్టమొదట శమము అనే మంచి దృఢమైన భగవద్విశ్వాసము కల్గిన యీ శమమును మనం చూడాలి. ఏదేని యందు ప్రవేశించవలెనన్న యీ కాపలాదారుని అనుమతి మనం పొందాలి. వారిని మనం స్వాధీనం చేసుకోవాలి. అప్పుడే యిందులో ప్రవేశించుటకు అధికారి కాగలడు. శమము అనగా లోకరీతిగా అంతరింద్రియముల తత్వాన్ని అణగద్రొక్కుకోటం. కాదు కాదు. ఇది సరైన అర్థం కాదు. అంతర్ బహిరింద్రియాల తత్వాన్ని నిర్మూలము చేసే మానసిక తత్వాన్ని అరికట్టేవాడు శముడు. అనగా ఏకాదశ రుద్రుల్ని తన స్వాధీనమునందుంచుకున్నవాడు యీ శముడు. ఏకాదశ రుద్రుడనగా ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనసు యీ పదకొండు తత్వములకు యేకాదశ రుద్రుడని పేరు. జ్ఞానేంద్రియములను అరికట్టుకున్నప్పుడు యీ కర్మేంద్రియములు సులభంగా మన వశమై పోతాయి. కర్మేంద్రియముల ద్వారా జరిగేది యేమీ లేదు. కనుక సర్వేంద్రియముల యొక్క తత్వాన్ని అరికట్టిన వాడే శముడు. ఈ శముని మనము వశము చేసుకోవాలంటే మనం కూడా శముని యొక్క తత్వాన్ని గుర్తించి వర్తించాలి. అనగా క్రమక్రమేణా మన యింద్రియములను స్వాధీనము చేసుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. ఇంద్రియములను స్వాధీనం చేసుకున్నవాడే మాస్టరు కాని యింద్రియములకు స్వాధీనమైనవాడు స్లేవు బానిస. నీవు మాస్టరుగా తయారు కావాలిగాని, స్లేవుగా తయారు కారాదు. నీవు యింద్రియములను వశం చేసుకున్నప్పుడు పశుపతిగా మారతావు. ఇంద్రియములకు నీవు వశమైనప్పుడు పశువుగా మారతావు. కాని దురదృష్టవశాత్తు పశుపతిగా మారవలసిన మానవుడు నేడు పశువుగా మారి తన ప్రవర్తనను మానవత్వానికి దూరం చేసుకుంటున్నాడు. అనేక జన్మలుగా యీ లౌకిక భోగభాగ్యములనుభవించి, దానియందే ఒక నిత్యసత్యమనే విశ్వాసమును అభివృద్ధి చేసుకొని, వాటినిమిత్తమై అల్లులు చూచి ఆరాటపడుతున్నాడు మానవుడు.

ప్రేమస్వరూపులారా! పశుపక్ష్మృగాదులు కూడను బాహ్యేంద్రియములను భోగభాగ్యములననుభవించి, యనేక విధములైన తమ ఆశలను నెరవేర్చుకొని తాము కూడా జీవిస్తున్నాయి. కాన జంతూనాం నరజన్మ దుర్లభం అని మానవుడు చాలా ఉత్కృష్టమైనవాడు. పవిత్రమైనవాడు. సౌజన్యము, సౌశీల్యములతో కూడిన మానవునిగా రూపొందవలసిన మానవుడు తాను కూడను పశుపక్ష్యమృగాదుల వలె యీ యింద్రియములకు వశము కావటం సరైనది కాదని ఖండిస్తూ వచ్చారు మహర్షులు. దానిని వశం చేసుకొనే విధానం యేమిటి? నేను నాది అని

519028704

ఈ ఆవరణ స్వరూపమైన దేహాన్ని తాను ప్రధానమైన లక్ష్యమునందుంచుకొనుటచేత ఈ దేహానందనిమిత్తమై తాను యనేకవిధములుగా బాధపడుతున్నాడు. కేవలం మట్టి, నీరు, నిప్పు, గాలిచే కూడిన యీ దేహము జడమైనదిగాని చైతన్యస్వరూపం కాదు కదా. జడమైన యినుము కూడను అయస్కాంతమునకు దగ్గర చేరినప్పుడు తాను దానిని కదిలింప చేస్తుంది. అదేవిధముగనే చిన్మయరూపుడైన ఆత్మతత్త్వము లోపల వుండటంచేత యీ జడమైన దేహం కూడను ఆ చైతన్యం చేత కదలుతూ వుంటుంది. అంతమాత్రం చేతనే నేను చైతన్యస్వరూపుడను అని భావించటము వెర్రితనము. కనుక చైతన్యమనేది లోపల నుండి యీ జడమైన దేహము చేత అన్నివిధమైన పనులు చేయిస్తూ వుంటుంది.

సమస్త పదార్థములు తమ ఆత్మతృప్తి నిమిత్తమై అనుభవిస్తున్నాడే కానీ ఆ పదార్థముల తృప్తికోసం కాదు. ఇది ఒక పుష్పము. ఈ పుష్పమును నేను వాసన చూస్తున్నాను. నా నిమిత్తమై యీ పుష్పమును నేను హస్తమునందుంచుకున్నాను గాని పుష్పము నిమిత్తమై యీ హస్తమునందుంచుకోలేదు. నా నిమిత్తమై నేను భోజనము చేస్తున్నానే గాని భోజన నిమిత్తమై నేను భోజనం చేయటం లేదు. అన్నీ నా నిమిత్తమై, నా నిమిత్తమై... ఆ నేను అనేది యెవరు. అదే మనం విచారణ చేయవలసినది. అదే ఆత్మతత్త్వము. అంతా ఆత్మతృప్తి నిమిత్తము మనమాచరిస్తున్నాము. కాని దేహతృప్తి నిమిత్తం కాదు. ఈ సత్యాన్ని మనం గుర్తించినప్పుడు సర్వకర్మలు కూడను భగవత్ప్రీత్యర్థం అనే విషయంలో మనం దీనిని అనుభవించినప్పుడు యిది యింద్రియనిగ్రహమునకు సులభమైన మార్గము. ఏ పనైనా చేయండి. అది అంతా దైవము యొక్క పని. work should be transformed into worship. ఏ పదార్థం కూడను శాశ్వతమైనది కాదు. క్షణభంగురమైనవే. కనుక యిట్టి నిత్యసత్యమైన ఆత్మతత్త్వాన్ని మనం గుర్తించాలనుకొన్నప్పుడు మనం ప్రతి కర్మను ఆత్మార్పిత బుద్ధితో మనం గావించటం ప్రథమ సాధన. కేవలం దేహవాంఛ లేక స్వప్రయోజనము యీవిధమైన స్వభావము నిమిత్తమై ఆచరించే కర్మలన్నీ కూడా భగవంతునికి అత్యంత దూరమై పోతాయి. ఈ స్వార్థము, స్వప్రయోజనము అనే సంకెళ్లను మనం త్యజించి యే నాడు స్వస్వరూపుడైన దైవభావముతో కర్మలను ఆచరించెదమో అదే మనకు నిజమైన స్వర్గము, నిజమైన freedom, నిజమైన liberation. అప్పుడే యీ శమము అనే ద్వారపాలకుడు మనకు స్వాగతము యిచ్చి ప్రవేశింపచేస్తాడు.

అనగా యిట్టి యింద్రియనిగ్రహము గావించినవాడు భగవంతునికి అత్యంత ప్రీతికరమైనవాడు. ఇతను near and dear. తన స్వంతవానిని యెవరికి యే ద్వారము వద్ద అడ్డుపెట్టటానికి అధికారము లేదు కదా! ద్వారము వద్ద యే బయటివారో, ఏ క్రొత్తవారో వచ్చినప్పుడు మాత్రమే అడ్డంపెట్టగలడు. రాజకుమారులు, రాజసంబంధీకులు, రాజు యొక్క బంధువులు రాజు యొక్క సోదరులు వారు వచ్చినప్పుడు యెవరు కూడను అడ్డుపెట్టరు. కనుకనే

519028705

భగవంతునితో సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని అనుభవించటానికి మనం యీ యింద్రియ నిగ్రహాన్ని పాటించాలి. దీనిని క్రమక్రమేణా దైవార్పిత భావముతో మనం ఆచరించటం యీ వయస్సులో అత్యవసరం. ఇది చాలా పునాది వంటిది. ఈ పునాది గట్టిగా వున్నప్పుడే భవిష్యత్తులో భవనమునకు భద్రత చేకూరుతుంది. ఈ ఫౌండేషన్ సరైన స్థితిలో వేయకపోతే భవనం యెట్టి క్షణములోనైనా కూలిపోవటానికి అవకాశముంటుంది. ఈ బ్రహ్మచర్య ఆశ్రమమనేది జీవితానికి పునాది వంటిది. దీనిని యీనాటి నుండి భగవదర్పితముగా మనం భావించి దీనిని పోషించుకోటం అత్యవసరం. ఇప్పటి నుండే భగవదన్వేషణ సల్పటం మనకు అత్యవసరం. ఎప్పుడో రిటైర్ అయిన తరువాత, old age వచ్చిన తరువాత అప్పుడింక పనివుండదు. అప్పుడు జపం చేసుకుంటూ కూర్చోవచ్చననుకుంటే యిది సాధ్యం కాదు.

పదపదమంచు కింకరులు పాశము లాగెడి వేళ బంధువుల్
దబదబ బయటపెట్టుడిక లాభము లేదని చెప్పువేళ
ఆలుబిడ్డలు లబలబ యేడ్చువేళ
తరమా! హరినామము నోట పల్కగన్.

మరి అప్పుడు చూచుకుందామంటే యీనామము. భార్యా బిడ్డలారా! యేడ్చకండి. యమధర్మరాజా కొంచెం దూరంగా వుండు నేను జపం చేసుకోవాలంటే వాడు విడుస్తాడా. ఏనాటికి విడువడు. ఈనాటి నుండి యే మనం ప్రారంభించాలి. అప్పుడే ఆ యమధర్మరాజుకు దగ్గర రావటానికి వీలుండదు. నీకు డౌట్ రావచ్చును. అసలు యమధర్మరాజు అనేవాడు వున్నాడా అని. యముడనగా కాలుడే. ఆ కాలుడే కాలము. అనగా కాలమే మనయొక్క యమధర్మరాజు. కాలము వచ్చి మనలను లాగుకొని పోతూవుంటుంది.

కనుక మనయొక్క పాశములు మనమే వేసుకుంటున్నాము. లోకములో ఉన్నికోట్ల మందికి పాశములు వేయాలంటే యమధర్మరాజుకు Rope factory లేదు. మన పుణ్యపాపములనే గంగాలు మనమే తయారు చేసుకుంటున్నాము. ఆ పాశములచేత మనమే మనను బంధించుకుంటున్నాము. మనం బంధించుకున్నదానినే పట్టుకొని పోతున్నారు దూతలు. కనుక మన దుష్కర్మలు, మన పవిత్ర కర్మలు దీనికి మూల కారణంగా రూపొందుతున్నాయి. కనుక నే యింద్రియ నిగ్రహము గావించుకున్న మానవుని దైవమే సన్నిధికి చేర్చుకుంటాడు. అట్టి దగ్గరకు చేర్చుకున్న వ్యక్తికి పెన్నిధి భగవంతుడే. సన్నిధి వల్ల భగవంతుని పెన్నిధిని అనుభవించటానికి సాధ్యమౌతుంది. కాని యీ పెన్నిధి, సన్నిధి యింద్రియ నిగ్రహమే. కనుక యింద్రియ నిగ్రహము కలవాడు శమమును సులభముగా వశముగావించుకోగలడు.

519028706

ఇంకొ రెండవ మెట్టు వాడు విచారణ. విచారణ అనేది ఎప్పుడు మనకు సంభవిస్తుంది రెండు వస్తువులు చేరినప్పుడే విచారణ మనకవసరం. ఈ రెండిటిలోపల యేది సరైనదని మనం విచారణ ప్రారంభిస్తాము. బియ్యం రాళ్లు చేరినప్పుడు బియ్యము యేవి, రాళ్లు యేవి అని విచారణ చేసి బియ్యము మాత్రమే ప్రత్యేకముగా తీసుకుంటాము. ఈ విభాగమనేది ప్రతి మానవునికి అత్యవసరము. కోతికి అరటిపండు యిస్తే దాని తోలనంతా తీసి మధ్యలో వుండే గుజ్జును మాత్రమే భుజిస్తుంది. కనుక లోకమైన ప్రతి పదార్థమును మనము విభాగం చేస్తున్నాము. అట్లే యీ విభాగ యోగమనే విచారణ యందు ఆత్మ, అనాత్మ విభాగం చెయ్యాలి. అదే విచారణ సల్పాలి. ఏదిసత్యము, యేది అసత్యము, ఏది మంచి, ఏది చెడ్డ. ఈ విచారణ యందు మానవుడు సక్రమమైన మార్గాన్ని అనుసరించాలి. ఇందులో తగిన బుద్ధి బలమును కూడను ప్రవేశపెట్టాలి. ఆ బుద్ధిని మనము చక్కగా ప్రవేశపెట్టినప్పుడే యింద్రియాలకతీతమైన స్థాయిని మనం పొందుతాము. ఈ ప్రాకృత సంబంధమైన వస్తువాహనాదులందు ఏది శాశ్వతము, ఏది అశాశ్వతము. అనుభవించే నేను శాశ్వతము. కానీ అనుభవించే పదార్థములన్నీ అశాశ్వతమే. ఈ నేను అనేది ఆత్మస్వరూపుడే గాని దేహము కాదు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహాని బంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడనా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ

పుట్టు ప్రతి పదార్థమునకు గిట్టుట మనేది వుంటుంది. ఏది పుట్టుక చావులు లేనిదో అదే సరైన స్వరూపము. దేహములన్నియు పుట్టేవే. పెరిగేవే. ఇవన్నీ షడ్వికారములతో కూడిన స్వరూపములే. అవే పుట్టుట, పెరుగుట, అభివృద్ధి గాంచుట, నశించుట, క్షీణించుట, అంతమగుట. కనుక యీ షడ్వికారములతో కూడిన ప్రతి పదార్థము అనిత్యమైనదే. ఈ విచారణ చక్కగా సల్పి యీ విచారణయందు సత్యమైన ఆత్మతత్వాన్ని గుర్తించుకున్నవానికే రెండవ gate man స్వాగతమిచ్చి లోపల ప్రవేశింప జేస్తాడు. అట్లు కాక అనిత్యమైన దేహమునకు మరింత బంధములు చేకూర్చుకొని యీ రకమైన బంధనలలో దుఃఖములను, విచారములను అనుభవిస్తూ తాను చెడినదే కాకుండా మరొక జీవితాన్ని కూడా చెరపటానికి ప్రయత్నించటము యిది విచారణకు విరుద్ధమైనది. కనుకనే యీ నిత్యానిత్య విషయ పరిశీలన చేయుట మనేది అత్యవసరము. అదే విచారణా శక్తి.

ఇంక మూడవది తృప్తి. తనకున్న దానినుంచే తృప్తిగనుచుండు అనగా తనకెంతవరకో అంతవరకు తృప్తి పడాలి. ఎవరికో ఒకనికి దారిలో పోతూ వుంటే 99 రూపాయలు చిక్కాయి. నా అదృష్టవశాత్తు, భగవదనుగ్రహం వల్ల నాకు 99 రూపాయలు చిక్కాయి కదా అని సంతోషిస్తే యింట్లో ఆనందం కల్గుతుంది. ఇంకొక్క రూపాయి చిక్కి వుంటే వంద రూపాయలౌనే అని తిరిగి అనుకుంటే ఆ మధ్య మార్గంలో యీ 99 రూపాయలు పోగొట్టుకుంటాడు. ఏదో తన

దికాదు. ఏదీ తనవెంట రాదు. తనవే అయితే తనవెంట యెందుకు రాకూడదు. ఏదో ఒక వ్యక్తి గోదావరి నదిలో స్నానం చేస్తున్నాడు. ఆ ప్రవాహంలో బంగారు పిడివున్న ఒక కత్తి కొట్టుకుని వచ్చింది. చూచాడు ఆ కత్తిని. ఆహా! నా అదృష్టమే నాడు పండింది. అందువల్లనే బంగారు పిడి నా చేతికి అందింది అనుకున్నాడు. స్నానం చేసి తిరిగి దానిని తీసుకుందామని ఆ కత్తిని గట్టుపైకి విసిరాడు. తాను మునిగాడు నమశ్శివాయ నమశ్శివాయ అని. ఇతను స్నానం చేస్తుంటే ఆ కత్తి క్రమక్రమేణా యెత్తు పల్లాలు వుండటంచేత పొర్లి పొర్లి వచ్చి నదిలో పడిపోయింది. తిరిగి అతను లేచి చూసేటప్పటికి ఆ బంగారు పిడి కత్తి లేదు. ఒకటే బాధపడుతున్నాడు. అయ్యో నా బంగారు పిడి కత్తి నదిలో కొట్టుకొనిపోయినే అని బాధపడుతున్నాడు. ఇదేమన్నా తన తాత సొత్తా. తను సంపాదించాడా. తాను తెచ్చుకున్నాడా నదిలో చిక్కింది. నదిలోకే పోయింది. ఇది నాది అనుకోటమే వీనికి ప్రధానమైన బంధన. రెండు నిముషాల లోపల ఆనందాన్ని యిచ్చింది. మూడో నిముషంలోపల దుఃఖాన్నిచ్చింది. పోనీ యీ రెండు నిముషాలైనా చేతికి చిక్కింది. ఆ బంగారు పిడిని చూశాను అని సంతృప్తిపడితే యెంత ఆనందించేవాడు. నేను యింటి నుండి తేలేదు అని సంతృప్తిపడే స్థితి వుంటే నిజంగా వానికి ఆ బంగారు కత్తి మిగిలి వుండేది. ఈనాడు లక్షాధికారి, కోటీశ్వరుడు కావాలని ఆశిస్తున్నాడు. ఆ కోటీశ్వరుడైనవాడు ఒక King కావాలని ఆశిస్తున్నాడు. ఒక్క ఊరి పంచాయతీ ప్రెసిడెంటు అయితే తిరిగి తక్షణమే M L A కావాలంటాడు. ఆ MLA అయ్యాక Minister కావాలంటాడు. ఇక minister అయ్యాక M.P. కావాలంటాడు. దాని తర్వాత Primeminister కావాలని ఆశిస్తాడు. అయిన దానిని తృప్తిగా అనుభవించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకొనే స్థితిగతులను వాడు యేమాత్రము యోచించడు.

అదేవిధముగా యీనాడు ప్రతి మానవుడు అసంతృప్తుడు కావటం చేత రైట్సుకు మాత్రం ఫైట్ చేస్తున్నాడు. కాని Responsibilities చూడటం లేదు. కనుకనే అసంతృప్తిగా మారిపోతున్నాడు. జీవితమంతా యీ అసంతృప్తితోనే సాక్కి సొల్లి కూలిపోతున్నాడు. కనుక తృప్తి ప్రతి మానవునికి అత్యవసరము. వాడే లోకానికంతా గొప్పవాడు. ఆదియే శంకరాచార్యుడు కూడను ఎవరు గొప్పవాడు యీ లోకంలో అని question వేసుకున్నాడు. who is the richest man in this world? He who has much satisfaction is the richest man. who is the poorest man in this world? He who has much desires is the poorest man. కనుకనే మనం ఉన్నతస్థాయికి పోవాలి. దైవస్థానాన్ని పొందాలి అనుకున్నప్పుడు యీ సంతృప్తి అనేది అత్యవసరము. వివేకానంద, రామకృష్ణ పరమహంస, తులసీదాసు, రామదాసు, కబీర్ దాసు యిలాంటి దాసులందరు పూర్వము యీ విధముగనే జీవితాన్ని గడుపుతూ వచ్చారు. వారికి ఒక్కొక్క సమయంలోపల భుజించటానికి యే మాత్రము ఆహారము చిక్కేదికాదు. అప్పుడు భగవంతుడు నాకు చక్కని అవకాశమందిస్తున్నాడు, వుపవాస దీక్షలో

519028708

నన్ను చేరమని భగవంతుడాదేశిస్తున్నాడు. యిది యెంత అదృష్టము అని వుపవాసంలో పలవారు ఆనందాన్ని అనుభవించేవారు. ఒకనాడు పంచభక్ష్యపరమాన్నములతో, అన్నివిధములైన పిండివంటలతో అందించినప్పుడు భగవంతుడీనాడు నన్ను యీ వుపవాసం త్యజించినాయనా చక్కగా ఆరగించమని భగవంతుడే పంపాడు. అని దీనికి దానికి రెండిటికి తృప్తిపడుతూ వచ్చేవారు. తిండి, శక్తి లేని సమయంలో కృంగిపోటంగాని, శక్తిసామర్థ్యములన్నీ చేకూరినప్పుడు పొంగిపోటంకాని యీరెండు ప్రమాదమని చెప్పి భావించారు. కనుకనే సమత్వంయోగముచ్యతే అన్నారు. ఆనాటి మహర్షులు యిలాంటి సమత్వాన్ని మనకు బోధించారు. సమత్వాన్ని అనుభవించాలి. సమత్వాన్ని లోకానికి అందించాలి. మనం పెంచాలి. ఇదే తృప్తికి చిహ్నము. ఇట్టి తృప్తి కల్గినవాడు భగవత్ సన్నిధిని, పెన్నిధిని అనుభవించటానికి అధికారి కాగలడు.

ఇంక నాల్గవది సత్సంగము. ఈ సత్సంగమనేది యీనాడు యువకులకు అత్యవసరం. చెడ్డ అభ్యాసములు, చెడ్డ ప్రవర్తనలతో కూడిన వారితో మనం స్నేహము చేస్తూవుంటాము. దానివల్లనే తిరిగి యిద్దరు చెడ్డవారుగా మారిపోతున్నారు. ఈ దుస్సంగాన్ని మనం దుడ్డు అయినా పెట్టి దూరం చేయాలి. సత్సంగాన్ని సర్వమూ యిచ్చి స్వాధీనం చేసుకోవాలి. దీనికి చక్కని ఉదాహరణము. చీకటి రాత్రిలో దట్టమైన అరణ్యములో ప్రయాణం చేసేవానికి లాంతరు పట్టుకొని పోయే వానిసహాయంతో మనం కూడా ప్రయాణం చేస్తే సులభంగా మనం దారిని చూడగలము. కాని యిద్దరు కూడను దీపము లేనివారుగా ప్రయాణం చేస్తే, యిద్దరు చిక్కుబడిపోతారు. లైట్ వున్నవానితో కలసి మనము కూడా ప్రయాణము చేస్తే మనము కూడా క్షేమంగా గమ్యాన్ని చేరతాము. అదేవిధముగా సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన సత్సంగము వుండిన వానితో మనం కూడా చేరితే ఉన్నత స్థాయిని పొందుతాము. మంచివారితో చేరిన చెడ్డవారికి కూడను విలువ హెచ్చుతుంది. చెడ్డవానితో చేరిన మంచివాడు విలువ కోల్పోతాడు. చిన్న ఉదాహరణ. పది లీటర్ల పాలు వున్నాయి. ఒక్కొక్క లీటరు నాల్గు రూపాయల చొప్పున దానికి విలువనిస్తున్నారు. దీనివల్ల నలభై రూపాయలు అతనికి చేరుతుంది. ఒక లీటరు బఝాలు వున్నది. ఒక లీటరు వాటరుకి ఒక్క నయాపైస కూడ యివ్వరు. ఎక్కడైనా ఎడారిలో వుంటే కొంటారేమో కాని సామాన్యముగా ఒక లీటరు వాటర్ కి విలువనివ్వరు. కాని ఒక లీటరు వాటరు పది లీటర్ల పాలతో చేరేటప్పటికి పదకొండు లీటర్ల పాలగా తయారై దానికి విలువనిస్తారు. అక్కడ బఝాలు అని పేరు పెట్టరు. పదకొండు లీటర్ల పాలు అంటారు. కనుక మంచి విలువైన దానిని యీ విలువలేని నీటిలో కలిపేటప్పటికి నీటికి కూడ విలువ వచ్చింది. పది లీటర్ల బఝాలు వుందనుకోండి: 1 లీటరు పాలు వుంది. ఈ ఒక లీటరు పాలకు నాల్గు రూపాయలిస్తారు. కాని యీ పది లీటర్ల నీటితో చేరితే దీని విలువ పోతుంది. దాన్ని బఝాలు అంటారు కాని పాలు అనరు. అదేవిధముగనే పదిమంది మంచి పిల్లలలో ఒక చెడ్డ పిల్లవాడు చేరినా పదకొండవ మంచి పిల్లవాడౌతాడు.

అదేరీతిగా కాకుండా పదిమంది చెడ్డ పిల్లలతో ఒక మంచివాడు చేరితే వాడు పదకొండవ దొంగగా తయారౌతాడు. కనుక మనం స్నేహం చేయాలనుకున్నప్పుడు సత్ప్రవర్తనతో, సద్భావనతో, సదాలోచనతో, సద్భావములతో వున్నవానితో మనం స్నేహం చేయాలి. లేకపోతే Hello Hello How are you good bye అంటే చాలు. ఇట్లువారితో మనకు ద్వేషమూ వద్దు. వారితో స్నేహమూ వద్దు. ఈనాడు చాలామంది పిల్లలు యీ నిత్యానిత్య విషయ పరిశీలన చేసే విచారణాశక్తి లేకపోవటం చేతనే దుస్సంగముతో చేరి, దుర్బుద్ధులతో మునిగి తన జీవితాన్నంతా దుర్వినియోగం చేసుకుంటున్నాడు.

కనుక మనము శమము, విచారణ, తృప్తి, సత్సంగము యీ నాల్గు ద్వారపాలుర సులభంగా దాటినప్పుడు దైవత్వము మనలోనే ఆవిర్భవిస్తుంది.

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడుండు తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తనదు చేయు పనుల తగిలియుండు.

పాపములంటే యే దేశము నుండియో, యెక్కడ నుండియో వూడిపడవు. మనం చేసే పనులలోనే పాపముంటుంది. ఇక్కడ పాపి అనగా యెవరు? Hero becomes zero if he forgets God వాడే పాపి. మానవునిగా మనము పుట్టి దైవత్వాన్ని మరవటమే పెద్ద పాపం. ఈ దైవత్వాన్ని మరచినవాడు దానవత్వంలో చేరిపోతాడు. దానవత్వముతో కూడినవాడు దయా దాక్షిణ్యములను పూర్తిగా విసర్జిస్తాడు. కనుక మనలో వున్న సద్గుణాలను మనం పోషించుకోటానికి దుర్గుణాలను దూరం చేయుటయే నిజమైన అదృష్టము. పూర్వము తస్మైనమః కర్మణే అన్నారు. భగవంతునికి ఒక రూపము లేదు. ఒక్క నామము లేదు. అలాంటి పరిస్థితిలో ప్రప్రథమములో ఋషులందరు చేరారు. తస్మైనమః కర్మణే అన్నారు. అనగా ఓ సుఖస్వరూపుడైన భగవంతుడా! నీకు నమస్కారము అన్నారు. ఇక్కడ సుఖమంటే యేమిటి? సుఖమంటే గొప్ప భవనాలు కట్టుకొని, సర్వానుకూలములు చేకూర్చుకొని, పంచభక్ష్య పరమాన్నములతో పొట్ట నింపుకొని యిష్టం వచ్చినట్లు సుఖంగా వుండటం యిది సుఖము కాదు. ఇది దేహ సంబంధమైన సుఖము. దైహికమైన సుఖము. సు - మంచి. ఖ - విశాలమైన. ఈం - అనంతమైన. మంచి అనంతమైన తత్వాన్ని పొందటమే సుఖము అన్నారు.

తంజావూరు మహారాజు వజ్రవైఢూర్య మాణిక్య మరకతగోమేధ పుష్యరాగములతో కూడిన నగలు నాణ్యాలు అంతా తెచ్చిపెట్టినప్పుడు త్యాగరాజు చెప్పాడు నిధి చాలా సుఖమా ఈశ్వర సన్నిధి చాలా సుఖమా! నిజముగా తెల్పుము. ఓ మనసా అన్నాడు. ఓ మనసా! నిధి సుఖమా నీ సన్నిధి సుఖమా చెప్పుము అన్నాడు. మనకు నిజమైన సుఖము యేమంటే అనంతమైన

519028710

దైవత్వాన్ని అనుభవించటమే మనసుఖము. ఆనాడు గొప్పగొప్పబిరుదులంతా తీసుకొని మనము గొప్పచదువులన్నీ ఆర్జించి దాని తర్వాత పెద్దపెద్ద అక్షరాలలో పదిపన్నెండు డిగ్రీలంతా పెట్టుకొని యేదో ఒక వుద్యోగమునకు మనము వెడుతున్నామంటే, వీడు యెంత గొప్పవాడురా అనుకుంటారు. ఈ గొప్పతనానికి అక్షరాలు కాదు ప్రధానము. గొప్పతనానికి మన నడతనే ప్రధానము.

ఒక మధ్యతరగతికి చెందిన వ్యక్తి వుండేవాడు. అతనికి యింటిలో యనేక కష్టాలంతా అభివృద్ధి అయ్యాయి. క్రమక్రమేణా కాలకర్మ కర్తవ్యాలు కలసిరాకపోవటంచేత తనపరిస్థితులు దినదినమునకు క్షీణించిపోతున్నాయి. ఆకాలములోపల ఒక వైశ్యుడు ఒక కొట్టులోపల మంచిబియ్యము, బేడలు యివంతా పెట్టుకొని పెద్ద వ్యాపారిగా తాను రూపొందాడు. ఇతని దగ్గరకు పోతే నా కుటుంబాన్నైనా పోషించుకోవచ్చని అతనికొక పెద్ద జాబు రాసాడు. అతని పేరు సచ్చిదానందం అనుకొండి. పేరు సచ్చిదానందంగాని ఆనందం యెక్కడ వెతికినా చిక్కటంలేదు పాపం. దానిపైన అడ్రసు వ్రాసాడు. శ్రీశ్రీశ్రీ సచ్చిదానందం. F.F.S, F.T.D. అని డిగ్రీలు వ్రాసాడు. షావుకారు చూచాడు. ఏమిటి యింత డిగ్రీలు తీసుకున్నవాడు నా కొట్టులో యేదోపని చేస్తానన్నాడే అని పిలిపించాడు పాపం. ఏమయ్యా యింత పెద్ద డిగ్రీలు తీసుకున్నావు నా కొట్టులో యేమిపని చేయగలవు ఏమేమి ప్యాస్ అయ్యావని అడిగాడు. F.F.S అంటే Father of Five sons. F.T.D అంటే Father of ten daughters అన్నాడు. ఇదే వాని qualification. మనం లేనివన్నీ పెట్టుకుంటున్నాము. కనుక ప్రక్కన వున్న అక్షరాలు డిగ్రీలుగా తీసుకోటం కాదు ముఖ్యం. మన ప్రవర్తనలో దానిని నిరూపించాలి. అక్షరాలకే మాత్రం విలువలేదు.

నీ యొక్క క్షరాన్ని అక్షరంతో ఏకం చెయ్యాలి. నీ క్షరము క్షేత్రము. అక్షరము క్షేత్రజ్ఞుడు. అక్షరమనగా జీవబ్రహ్మైక్యానుసంధానము అని దీని అర్థము. అనగా అఖండమైన అనంతమైన అమృతత్వమైన తత్వానికి అకారమనేది ఆత్మస్వరూపము, క్షరమనగా నశించిపోయేది క్షీణించిపోయేది, దుఃఖమునకు గురయ్యేది. కనుక అనిత్యమైన క్షరము, నిత్యమైన ఆకారము రెండింటి చేరికయే అక్షరము. అనగా జీవుడు దేవునితో కూడినప్పుడే వాడు అక్షర స్వరూపుడౌతాడు. జీవుడు క్షరము. దేవుడు అకారమైన ఆత్మస్వరూపము. కనుకనే తులసీదాసు కూడను చెప్పాడు. అకార, రకార, మకారముల యొక్క తత్వమును గురించి యోచించుచూ 'కుశానుభాను హిమకరతే' అన్నాడు. కుశ, భాను, హిమకరతే. కుశుడనగా అగ్ని, భానుడనగా సూర్యుడు, హిమమనగా చంద్రుడు. కనుక అగ్నిసూర్యచంద్రాదులతో కూడిన నామము నీ నామము రామచంద్రా అన్నాడు. రా, అ, మ. రా అనగా అగ్ని పాపములను భస్మం చేస్తుంది. అ అనగా సూర్యుడు. సూర్యుడనగా అంధకారాన్ని నిర్మూలం గావిస్తాడు. మ అనగా చంద్రుడు. తాపమును చల్లార్చి ఆనందాన్ని చేకూరుస్తాడు. కనుక పాపమును నిర్మూలం చేసి, అజ్ఞానము దూరంగావించి, నా తాపాన్ని చల్లార్చే ఓ రామచంద్రా!

కృశాను భాను హిమకరతే అని టైటిల్ యిచ్చాడు. అనగా వానిని బట్టి తాము చేసే పనులను బట్టి డిగ్రీలుగాని, కేవలం పనులు చేయకుండా డిగ్రీలు మాత్రం పెంచుకోటం అది పెద్ద స్టంట్ అని చెప్ప వచ్చును. కనుక మనము డిగ్రీలతో పాటు ప్రవర్తనను కూడను మనం నిరూపించాలి. ప్రతీ విద్యార్థి క్రమక్రమేణా యీ యింద్రియాలను నిగ్రహించుకోటానికి ప్రయత్నించాలి. ఇలాంటి ప్రయత్నం చేత మనము దైవానుగ్రహాన్ని యెంతైనా సాధించటానికి అవకాశముంటుందని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.